సాక్షి
సూర్యాపేట
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



ధాన్యం నిల్వలో జాగ్రత్తలు..
ధాన్యం నిల్వ చేసుకోవడంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. - 8లో



యాదాద్రి క్షేత్రానికి భద్రత ఏదీ..
యాదాద్రి ప్రధానాలయం ఉద్ఘాటన జరిగిన ఏడాది గడిచినా పూర్తిస్థాయి భద్రత కనిపించడం లేదు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
40°/25°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



నారు నుంచి కోత వరకు..
తెగుళ్లే!

కోత దశలోనూ వరికి చీడపీడలు
- నాలుగైదు సార్లు మందుల పిచికారీ
- అయినా ప్రయోజనం శూన్యం
- ఆందోళన చెందుతున్న రైతులు


తాలుగా మారిన గింజలు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో వరి సాగు చేసిన రైతులకు కష్టాలు తప్పడంలేదు. యాసంగి సీజన్‌లో వరిని తెగుళ్లు వీడడం లేదు. నారు పోసింది మొదలు పంట కోసే వరకు ఏదో ఒక తెగులు ఆశించి నష్టపరుస్తోంది. ప్రస్తుతం జిల్లాలో చాలావరకు వరి పొలాలు కోత దశకు వచ్చినా.. ఊస తిరుగుడు, మెడవిరుపు తెగుళ్లతో పెద్దఎత్తున వరి కంకులు తాలుగా మారిపోతున్నాయి. వీటి నివారణకు పురుగుల మందులు పిచికారీ చేస్తున్నా ఉపయోగంలేకుండా పోతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొగిపురుగుతో మొదలు..
ప్రస్తుతం జిల్లాలో యాసంగి సీజన్‌లో మొదటగా నాటువేసిన పొలాలు వారం రోజులుగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇక అధికభాగం పొలాలకు ఒకట్రెండు తడులు అవసరం ఉండగా.. మరికొన్ని ఈతదశలో ఉన్నాయి. ఈ సంవత్సరం ఎన్నడూ లేనివిధంగా మొగిపురుగు రైతులను నిండా ముంచింది. దీని నివారణ గుళికలు, రెండుసార్లు పైపాటుగా పురుగుల మందులను పిచికారీ చేశారు. ఆ తర్వాత పొట్టదశ నుంచి పొలాలు ఈతపడుతుండగా.. ఊసతిరుగుడు కారణంగా కంకులన్నీ తాలుగా మారుతున్నాయి. ఈ ఊసతిరుగుడు నివారణకు మందులు కొట్టినా ఫలితం లేకుండా పోయింది. అలాగే గింజలుగా మారే సమయంలోనూ మెడవిరుపు తెగులు సోకి తాలు అవుతోంది. ఇప్పటికే నాలుగైదు సార్లు మందులను పిచికారీ చేసి పెట్టుబడులు అధికంగా పెట్టామని.. ఈ తెగుళ్ల కారణంగా ఆశించిన మేర పంట దిగుబడి రావడం లేదని రైతులు వాపోతున్నారు.

దొడ్డు రకం వరికి..
నాగార్జునసాగర్, మూసీ, ఎస్సారెస్పీల ద్వారా నీరు అందడంతో జిల్లాలో యాసంగిలో దాదాపు 4.66 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. నాట్లు పడిన నాటినుంచి దొడ్డురకం వరికి తెగుళ్లు సోకాయి. గతంలో యాసంగి పంటకు ఒక్కసారి కూడా మందులు పిచికారీ చేసేవారు కాదు. అలాంటిది ఒక్కో రైతు నాలుగైదుసార్లు మందులు కొట్టాడంటే తెగుళ్ల ఉధృతి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

యాసంగి వరి సాగు అంచనా	4.66 లక్షల ఎకరాలు
పంట కోతకు వచ్చిన విస్తీర్ణం	2.60 లక్షల ఎకరాలు
కోత కోసింది..	80 వేల ఎకరాలు
ఈత దశలో ఉన్న విస్తీర్ణం	1.30 లక్షల ఎకరాలు

తెగుళ్లతో దిగుబడి తగ్గుతోంది



ఈ యేడు ఎప్పుడూ లేనివిధంగా వరికి తెగుళ్లు సోకాయి. ఎన్నిసార్లు మందులు కొట్టినా పనిచేయలేదు. మొగిపురుగు కారణంగా పంట ఎదుగుదల చాలా వరకు లోపించింది. తర్వాత ఊస తిరుగుడు, మెడవిరుపు సోకాయి. సాగు ఖర్చులు కూడా వచ్చేది కష్టమే.
– లింగంపల్లి మల్లయ్య, కుక్కడం, రైతు

ఊసతిరుగుడు ఉధృతంగా ఉంది



వరి పొలాలకు మొగిపురుగు, ఊస తిరుగుడు సోకింది. మొగి పురుగుకు రెండు, మూడురకాల మందును పిచికారీ చేస్తేనే అదుపులోకి వచ్చింది. ముందస్తుగా ఊసతిరుగుడుకు మందు కొట్టినా పనిచేయలేదు. కంకులన్నీ తాలుగా మారుతున్నాయి.
– కప్పల వెంకన్న, ఆత్మకూర్, రైతు

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



రైతులు తెగుళ్ల ఉధృతి తీవ్రం కాకముందే వ్యవసాయ అధికారులను సంప్రదించి సూచనలు పాటించాలి. ఊసతిరుగుడు, మెడ విరుపు కోసం అంకురం నుంచి చిరు పొట్టదశలో తప్పనిసరిగా ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జీ గుళికలు 4 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సీ 0.3 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
– దివ్య, మండల వ్యవసాయ అధికారిణి, ఆత్మకూర్ (ఎస్)

పేటను నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా


సూర్యాపేట పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- మంత్రి జగదీశ్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సూర్యాపేట: సూర్యాపేట పట్టణాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని 15వ, 34వ వార్డులలో మూసీ, నాలాపై రూ. 54లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన కల్వర్ట్, బ్రిడ్జిలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధే ఎజెండాగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపే పట్టణంలో సాగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. 2014కు ముందు ప్రస్తుతం సూర్యాపేటలో ఉన్న పరిస్థితులపై ప్రజలు ఆలోచించాలని కోరారు. సూర్యాపేటను నందనవనంగా మార్చడమే తన లక్ష్యమని, బ్రిడ్జి పనులను నెల రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.కాలనీల్లో కనీస సౌకర్యాల కల్పనలకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్‌కుమార్, కౌన్సిలర్లు ఎలిమినేటి అభయ్, మడిపల్లి విక్రమ్, భరత్ మహాజన్, జ్యోతికరుణాకర్, రంగినేని లక్ష్మణ్‌రావు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బూర బాలసైదులు, రాష్ట్ర కార్యదర్శి వై.వీ, రాష్ట్ర నాయకులు ఉప్పల ఆనంద్, గుర్రం సత్యనారాయణరెడ్డి, స్వరూప పాల్గొన్నారు.

ఓటమి.. విజయానికి తొలిమెట్టు


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నమంత్రి

సూర్యాపేటటౌన్ : 'ఓటమి విజయానికి తొలిమెట్టు.. ఆడి ఓడాలి.. ఓడితే కుంగిపోద్దు.. మీ నడవడికే.. మీ కుటుంబానికి పేరు, ప్రతిష్టలు తెచ్చిపెడతాయి' అని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ 2, 3, 4లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులకు మంత్రి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. ఉపాధి అంటే ఉద్యోగమే కాదని, ఉద్యోగ ప్రయత్నాలు మంచిదే అని ఒకవేళ రాకుంటే నిరాశ పడొద్దన్నారు. ఉద్యోగ ప్రయత్నమే జీవితం అనుకోవడం పొరపాటు అవుతుందని, ప్రపంచీకరణలో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కలల సాకారానికి విద్యార్థి , యువత ఎప్పుడూ సాధన చేస్తూనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి దయానందరాణి, చినశ్రీరాములు, స్టడీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : జిల్లా యువజన, క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 14 సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్‌కు సంబంధించి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అధికారి బి.వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఉత్సాహవంతులైన వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు వారు నిర్వహించే క్రీడా వివరాలు, గ్రామం, ప్రదేశం తెలియజేస్తూ పూర్తి వివరాలతో తమ కార్యాలయంలో ఈ నెల 21లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ 9100949979ను సంప్రదించాలని సూచించారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి


తిరుమలగిరిలో కంటి వెలుగు శిబిరంలో రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుమలగిరి (తుంగతుర్తి) : వేసవి కాలంలో ఎండలు అధికంగా ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి కోటాచలం సూచించారు. బుధవారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తరువాత పనికి వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి మల్లెల వందన, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఐటీసెల్ జిల్లా కో కన్వీనర్‌గా రాజశేఖర్‌రెడ్డి


మునగాలలో రాజశేఖర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న భాగ్యరెడ్డి

మునగాల: బీజేపీ జిల్లా ఐటీ సెల్ కోకన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన బీజేవైఎం జిల్లా నాయకుడు గాయం రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ మండల పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి చేతుల మీదుగా రాజశేఖర్‌రెడ్డి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఐటీసెల్ కన్వీనర్ కొమరగిరి గోపాలకృష్ణ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అవినీతిని సోషల్‌మీడియాలో ఎండగట్టాలన్నారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీతోనే యువతకు భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్, బీజేపీ జిల్లా కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్‌కుమార్, జిల్లా కార్యదర్శి తోట శేషు, ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్య, జిల్లా అధికార ప్రతినిధి పత్తిపాటి విజయ్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ కొమరగిరి శేషగిరిరావు, గోపిరెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం విశేష పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన చేపట్టారు. అనంతరం శ్రీస్వామి వారికి బాలభోగం, మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అలాగే సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చ, ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలను నిర్వహించారు. రాత్రి పవళింపు సేవ చేసి ఆలయాన్ని మూసివేశారు.

రుణమాఫీ హామీ అమలు చేయాలి


హుజూర్‌నగర్‌రూరల్ : ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన లక్ష రూపాయల రుణమాఫీ, పంటల బీమా పథకం హామీలను వెంటనే అమలు చేయాలని నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని వేపలసింగారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డితో కలిసి అయన ప్రారంభించి, ధాన్యం రాశులను పరిశీలించి మాట్లాడారు. 10 ఎకరాలు పైబడి ఉన్న రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు బకాయిలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. తెలంగాణ రైతాంగానికి సీఎం కేసీఆర్ ఉచితంగా ఎరువులు ఇస్తామన్న హామీని మరిచిపోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండి రైతులు పండించిన ప్రతి గింజనూ ఎమ్మెస్పీకి కొనుగోలు చేసేలా కృషి చేయాలన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం బాయిల్డ్ రైస్ తీసుకోము అన్నప్పుడు తాను ఎంపీగా రైతుల పక్షాన పోరాడినట్లు తెలిపారు. రైతులు పండించిన ఏ రకం ధాన్యం (సన్న, దొడ్డు) అయినా ఎంఎస్‌పీ కంటే ఎక్కువ ధర రావాలనేదే తమ అభిమతమని లేని పక్షాన కాంగ్రెస్ పార్టీ, తాను పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా పండే 1010 రకం ధాన్యానికి సరైన రేటు రావడానికి కేంద్రం ఇంకా ముందు ప్రారంభోత్సవం చేయాల్సిందని పేర్కొన్నారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని పార్లమెంట్‌లో ప్రధాని మోదీ పదేపదే హామీలు ఇచ్చినా నేటికీ నెరవేరలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంటేశ్వర్లు, సహకార శాఖ అసిస్టెంట రిజిస్ట్రార్ బొల్లేపల్లి అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఊరే రాధాకృష్ణ, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, ఉప సర్పంచ్ సావిత్రి, పీఏసీఎస్ డైరెక్టర్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వేపలసింగారంలో తూకాన్ని పరిశీలిస్తున్న ఉత్తమ్

ప్రతి నియోజకవర్గం నుంచి 300 మంది

- అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గం నుంచి 300 మందిని తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. బుధవారం సాయంత్రం సంబంధిత అధికారులతో వేబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర మాట్లాడుతూ జిల్లా అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, ఎస్. మోహన్ రావుల ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా నుంచి అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతినిధులను తరలిస్తారని చెప్పారు. కోదాడ నియోజకవర్గంలో ఆర్డీఓ కిషోర్ కుమార్, సూర్యాపేటలో రాజేంద్రకుమార్, హుజూర్‌నగర్‌లో వెంకారెడ్డి, తుంగతుర్తిలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్‌లు తరలించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తారన్నారు. మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు ఏర్పాట్లు చూడాలన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి 300 మంది ప్రతినిధులు ఆరు బస్సుల్లో బయలుదేరుతున్నారని, జిల్లాలో 24 పాయింట్లును ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బస్సులో ఒక లైజన్ ఆఫీసర్, ఒక పోలీస్ కానిస్టేబుల్, వీఆర్ఏ ఉంటారని, అలాగే ప్రతి బస్సులో తాగునీరు, స్నాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. జిల్లా నుంచి 1200 మంది ప్రతినిధులు, లైజన్ ఆఫీసర్స్ అందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

రోడ్డుకు మోక్షం ఎప్పుడు..

- కోదాడలో గుంతలమయంగా ప్రధాన రహదారి
- ప్యాచ్ వర్క్‌తో సరిపెడుతున్న అధికారులు
- రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు


ఇదీ కోదాడ పట్టణంలోని ఖమ్మంక్రాస్ రోడ్డులో ప్రధాన రహదారి దుస్థితి. మోకాలి లోతు గుంతలు పడి ఏడాది కాలంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది దీనిపై ఫిర్యాదులు చేసినా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. రాత్రి సమయంలో దీనిని గమనించక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.


కోదాడ: కోదాడ పట్టణంలో ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. కొమరబండ వై జంక్షన్ నుంచి దుర్గాపురం వరకు దాదాపు మూడున్నర కిలోమీటర్ల మేర ఈ రహదారి వర్షాకాలంలో దెబ్బతిన్నది. ఈ రోడ్డుపై పట్టణవాసులు తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో రెండు నెలల క్రితం గుంతలను ప్యాచ్‌వర్క్‌తో సరిపెట్టారు. ఇలా గుంతలకు రెండేళ్లుగా ప్యాచ్ వర్క్ చేస్తూ వస్తున్నారే తప్పా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంలేదు. దీంతో రోడ్డంతా ఎగుడు దిగుడుగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ప్యాచ్‌వర్క్ కూడా సరిగా చేయక..
కొమరబండ నుంచి దుర్గాపురం వరకు రోడ్డు దెబ్బతినగా అధికారులు మాత్రం రామ్మూర్తి నగర్ నుంచి ఖమ్మం క్రాస్ రోడ్డు వరకే ప్యాచ్ వర్క్ చేశారు. ఇటు కొమరబండ వైపు.. అటు దుర్గాపురం వైపు వదిలేశారు. ఈ ప్యాచ్‌వర్క్ కూడా సక్రమంగా చేయలేదు. రోడ్డుకు ఒక వైపు చేస్తే మరో వైపు వదిలేశారు. గుంతలు పూడ్చే సమయంలో వాటిలోని మట్టి, దుమ్ము తొలగించకుండా తారు వేయడంతో అది లేచి పోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి.

పూర్తిస్థాయి మరమ్మతులు చేయరా..
కోదాడ పట్టణంలో 70 వేల మంది జనాభా ఉంటారు. రోజూ కోదాడకు వివిధ పనులపై 20వేల నుంచి 30 వేల మంది వచ్చి పోతుంటారు. పట్టణంలో ఎటునుంచి ఎటు వెళ్లాలన్నా ప్రధాన రహదారి ఒక్కటే మార్గం. ఒక వైపు పెద్ద చెరువు, మరో వైపు ఇరుకురోడ్లతో పాటు ఎర్రకుంట ఉండడంతో పట్టణ ప్రజలంతా ప్రధాన రోడ్డు మీది నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. విజయవాడ–హైదరాబాద్ వెళ్లే బస్సులు కూడా ఈ మార్గంలోనే వెళ్లాలి. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ రోడ్డుకు రెండేళ్లుగా మరమ్మతులు చేస్తామని చెబుతున్న అధికారులు ఆచరణలో మాత్రం విస్మరించారు. రూ.3.50కోట్లతో టెండర్లు పిలిచామని.. కాంట్రాక్టర్లు పనులు చేయడానికి రావడం లేదని... రెండోసారి కూడా టెండర్లు పిలిచామని కొద్ది రోజుల్లోనే మరమ్మతులు చేస్తామని ఇలా రెండేళ్లుగా అధికారులు చెబుతూ వస్తున్నారే తప్పా పనులు మాత్రం చేయించడంలేదు.

మిషన్ భగీరథ గాతులదీ అదే పరిస్థితి..
పట్టణంలో మూడేళ్ల క్రితం మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణ సమయంలో సీసీ రోడ్లను తవ్వి ప్రతి ఇంటి ముందు గాతులు తీసి పైపులు వేశారు. ఆ తర్వాత వాటిని పూడ్చడం మరిచారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆరు నెలల క్రితం కొన్ని వార్డుల్లో మున్సిపాలిటీ నిధులతో గాతులను పూడ్చినా నాణ్యత లేక వేసిన వారానికి కంకర లేచి పోయింది.

మున్సిపాలిటీ పరిధి కాదు



పట్టణంలో ప్రధాన రహదారి మరమ్మతులు మున్సిపాలిటీ పరిధికాదు. ఆర్‌అండ్‌బీ అధికారులు దానికి మరమ్మతులు చేయిస్తారు. గుంతలవల్ల ఇబ్బంది అవుతున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లాం. ప్యాచ్‌వర్క్ చేశారు. త్వరలో పూర్తిస్థాయి మరమ్మతులు చేస్తామన్నారు. మిషన్ భగీరథ గాతులను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం.
– మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్, కోదాడ

సరికొత్తగా స్కూల్ యూనిఫాం

- డిజైన్ మార్చిన విద్యాశాఖ
- వేసవి సెలవుల్లో కుట్టించేలా కసరత్తు
- పాఠశాలల ప్రారంభం నాటి నుంచే విద్యార్థులకు పంపిణీ చేసేలా ప్రణాళిక



నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా ప్రభుత్వం రెండు జతల దుస్తులను అందిస్తోంది. కానీ విద్యా సంవత్సరం ప్రారంభ సమయంలో కాకుండా ఆలస్యంగా అందిసున్నారు. పంపిణీ చేసిన దుస్తులు విద్యార్థులకు సైజ్ సరిపోకపోవడం పరిపాటిగా మారింది. ఈ సారి అలా కాకుండా ముందుస్తుగానే కొత్త డిజైన్లతో కార్పొరేట్ తరహాలో యూనిఫాం తయారు చేసి ఇచ్చే యోచనలో విద్యాశాఖ కసరత్తు చేస్తుంది.

విద్యా సంవత్సరం ప్రారంభంలోగా...
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన ముడి వస్త్రం తెప్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. త్వరలోనే పాఠశాలల్లో పిల్లల కొలతలు తీసుకోనున్నారు. గతేడాది యూనిఫాం పంపిణీలో జాప్యం కారణంగా పంద్రాగస్టుకు కూడా విద్యార్థులు పాత దుస్తులే ధరించాల్సి వచ్చింది. రానున్న కొత్త విద్యా సంవత్సరంలో బడి ప్రారంభం నాటి నుంచే విద్యార్థులకు రెండు జతల దుస్తులు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముడి వస్త్రం జిల్లాకు చేరగానే వేసవి సెలవుల్లో టైలర్ల వద్దకు చేర్చి అక్కడి నుంచి పాఠశాలల పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు అందించేలా ప్రణాళిక రూపొందించారు.

63,805 మంది విద్యార్థులు..
2022–2023 విద్యా సంవత్సరంలో యూడైస్ ఆధారంగా జిల్లా వ్యాప్తంగా 958 పాఠశాలల్లో 63,805 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యార్థులకు 3,24, 177.15 మీటర్ల ముడి వస్త్రం అవసరం. వీరందరికీ వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి రెండు జతల దుస్తులు అందించనున్నారు. ఇందుకు అవసరమైన ముడి వస్త్రం టెస్కో నుంచి జిల్లాకు సరఫరా కానుంది. పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు, ఎస్ఎంసీ చైర్మన్లకు దుస్తులు కుట్టించే బాధ్యతలు అప్పగించారు. వేసవి సెలవుల్లో దుస్తులు కుట్టే ప్రక్రియ పూర్తి చేయాలని, పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు రెండు జతల దుస్తులు అందించాలని విద్యాశాఖ షరతులను విధించింది.

యూనిఫాం ఇలా..
యూనిఫాం సరికొత్త రూపంలో కుట్టించనున్నారు. రంగులు మార్చకుండా డిజైన్ మాత్రమే మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు విధి విధానాలను రూపొందించారు. 1వ తరగతి నుంచి మూడో తరగతి బాలికలకు ఫ్రాక్‌లు ఒకరంగా, 4, 5 తరగతుల విద్యార్థులకు స్కర్ట్ కుచ్చిళ్లతో రూపొందించారు. చొక్కాకు రెండు జేబులు, చొక్కా మధ్యలో షూటింగ్ క్లాత్‌తో పట్టి, భుజాలపై క్లాపులు, రెండు చేతులకు క్లిప్పులతో దుస్తులను తీర్చిదిద్దనున్నారు. 6 నుంచి 12వ తరగతి వరకు బాలికలకు పంజాబీ డ్రెస్ తరహాలో రూపొందించారు. బాలురకు షర్టుకు జేబులు, పట్టీలు, చేతులకు క్లిప్‌లు, భుజాలకు క్లాపులు, గతంలో మాదిరిగానే నిక్కర్, ప్యాంట్లు అందించనున్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం కాగానే ఇచ్చేలా ఏర్పాట్లు



విద్యార్థులకు అందించే దుస్తుల పంపిణీలో జాప్యం లేకుండా విద్యాశాఖ ఈసారి ముందుగానే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాకు షర్ట్‌క్లాత్‌లు వచ్చాయి. మిగితా ముడి వస్త్రం రాగానే ఎమ్మార్సీలకు పంపిణీ చేస్తాం. వెంటనే వీటిని కుట్టించి పాఠశాలలు పునఃప్రారంభం కాగానే రెండు జతల దుస్తులు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.
– అశోక్, డీఈఓ, సూర్యాపేట.

న్యాయవాద రక్షణ చట్టం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి


నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న స్థానిక బార్ అసోసియేషన్ నాయకులు

హుజూర్‌నగర్: న్యాయవాద రక్షణ చట్టం తేవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో హుజూర్‌నగర్ బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్లె నాగేశ్వరరావు, సరిత దంపతులకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రామిరెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. తొలుత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాముల రామిరెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి శ్రీనివాసరావు, ఏజీపీలు శ్రీనివాసరెడ్డి, వీజీకే మూర్తి, న్యాయవాదులు రవికుమార్, యాదగిరి, అంజయ్య, రమణారెడ్డి, చంద్రయ్య, కృష్ణయ్య, పి. శ్రీనివాస రావు,. సురేష్, శ్రీనివాసరావు, సురేష్, శంకర్, మహేష్, సైదా హుస్సేన్, క్రాంతి, ప్రదీప్తి, రమాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి కేసులో నిందితుడి రిమాండ్

పాలకవీడు: మండల పరిధి మహంకాళిగూడెం గ్రామ పంచాయతీ భవానీపురంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమలోని సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రావిపహాడ్‌కు చెందిన చిమట వెంకన్న తన ట్రాక్టర్‌తో సిమెంట్ పరిశ్రమ బౌండరీ గోడ కూల్చివేశాడు. అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఈ మేరకు పరిశ్రమ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ గోపీకుమార్ ఫిర్యాదు మేరకు వెంకన్నను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సైదులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మోటకొండూర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తేర్యాల గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. మోటకొండూర్ మండలం తేర్యాల గ్రామానికి చెందిన ఇంద్రాల రాములు(53) మంగళవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద కల్లు తేవటానికి వెళ్తున్నానని భార్యకు చెప్పి బయలుదేరాడు. రాత్రి అవుతున్నా రాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ లభించలేదు. ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా బురద మడిలో విగతజీవుడిగా కనిపించాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఐలమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాగి మధుసూదన్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- గులాబీ జెండా అందరికీ అండ
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తోందని పేర్కొన్నారు . బుధవారం సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని కుడకుడ, కోమటికుంటకు చెందిన 100మంది యువకులు కాంగ్రెస్, బీజేపీలను వీడి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను రెండు కళ్లలా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని మరింతగా బలోపేతం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. గ్రామాలు, పణాలలో ప్రజల సమస్యలు పరిష్కారానికి, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. గతంతో పోలిస్తే గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కండ్లముందే కనిపిస్తున్నదన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి చూసి ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రతి కార్యకర్త తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుర్రం సత్యనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ సైదులు, మాజీ మార్కెట్ డైరెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

చివ్వెంల(సూర్యాపేట) : రోడ్డు పక్కన గుడిసెలో నివసిస్తున్నపేదలకు వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామంలో ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన రోడ్డు పక్కన పూరి గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలకు చూసి చలించి పోయారు. వెంటనే కాన్వాయ్ దిగి వారి వద్దకు వెళ్లి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారు ఇల్లు నిర్మించుకోవాడానికి రూ.3 లక్షల చొప్పున మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనుకోని అతిథి ఇంటి ముందుకు వచ్చి ఇల్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు ఆవుల అంజయ్య, ఆవుల లింగయ్య మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేతలకు ప్రచార అస్త్రంగా 'బలగం'

- పోటాపోటీగా గ్రామాల్లో సినిమా ప్రదర్శన
- ప్రజలకు గుర్తుండిపోయేలా నాయకుల ప్రయత్నాలు

మునుగోడు: కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కిన బలగం సినిమా రాజకీయ పార్టీల నాయకులకు ప్రచార అస్త్రంగా మారింది. పేద, మధ్య తరగతి వర్గాల జీవన స్థితిగతులే ఇతివృత్తంగా చిత్రీకరించిన ఈ సినిమాను చూడాలనే కోరిక గ్రామాల్లోని ప్రతి ఒక్కరిలో మొదలైయింది. కానీ, గతంలో మాదిరిగా మండల కేంద్రాల్లో సినిమా థియేటర్లు లేకపోవడం, గ్రామాల నుంచి జిల్లా కేంద్రాలకు వచ్చి సినిమా చూసే ఆర్థిక స్థోమత లేని పేదలు ఎంతో మంది ఉన్నారు. వారందరికీ రాజకీయ నాయకులు సొంత డబ్బులు ఖర్చుచేసి గ్రామ ప్రధాన కూడలిలో రాత్రి సమయంలో సినిమా ప్రదర్శించి అందరికీ గుర్తుండిపోయేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

రూ.10 వేలతో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శన..

బలగం సినిమాను ప్రదర్శిస్తే గ్రామస్తులు తమను గుర్తుపెట్టుకుంటారని రాజకీయ పార్టీల నాయకులు రూ.10వేలు ఖర్చు చేసి ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శిస్తున్నారు. సాధరణంగా సినిమా థియేటర్‌లో ఒక్కరు సినిమా చూస్తే రూ.100 టికెట్ తీసుకొని చూడాల్సి ఉంటుంది. అదే సినిమా నాయకులు తమ గ్రామంలో ఉచితంగా పదర్శిస్తుడంటంతో కుటుంబ సభ్యులు అంతా వెళ్లి వీక్షిస్తున్నారు. ఆ సినిమా చూసేందుకు వచ్చిన ప్రజలందరికీ కుటుంబాలు కలిసి ఉండాలని సందేశాలు ఇచ్చి ప్రదర్శిస్తున్నారు. మునుగోడు మండల వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి ఇప్పటికే దాదాపు 15 కుపైగా గ్రామాల్లో సినిమాను ప్రదర్శించగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన చల్లమల్ల కృష్ణారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిలు పలు గ్రామాల్లో పదర్శింపజేశారు. వారితో పాటు మరికొందరు సంపన్న కుటుంబాల వ్యక్తులు చనిపోయిన కుటుంబ సభ్యుల స్మారకార్థం గ్రామాల్లో బలగం సినిమాను ప్రదర్శిస్తున్నారు. ఏది ఏమైనా బలగం సినిమా రాజకీయ పార్టీ నాయకులకు ప్రచార ఆయుధంగా మారిందని గ్రామాల్లో చర్చ జరుగుతోంది.

నీలగిరిలో దొంగల హల్‌చల్

- తాళం వేసిన పలు ఇళ్లలో నలుగురు ముఠా సభ్యుల చొరబాటు
- సొత్తు లభించకపోవడంతో వెనుదిరిగిన వైనం
- ఇనుపరాడ్లు, ఆయుధాలతో సంచారం
- సీసీ ఫుటేజీల్లో రికార్డయిన కదలికలు

నల్లగొండ క్రైం : నీలగిరి పట్టణంలో బుధవారం తెల్లవారుజామున దుండగులు హల్‌చల్ సృష్టించారు. నలుగురు వ్యక్తులు గల ఓ ముఠా పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో ఆయుధాలతో సంచరించింది. లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్‌లో జీ8 ఫ్లాట్, బృందావన్‌కాలనీ, విశ్వనాథ కాలనీల్లో తాళాలు వేసిన పలు నివాసాల్లోకి చొరబడి సోదాలు నిర్వహించారు. అయితే, ఆ ఇళ్లలో ఎలాంటి సొత్తు లభించకపోవడంతో నిరాశతో వెనుదిగారు. ఓ దొంగ అపార్ట్‌మెంట్ కింద ఉండగా ముగ్గురు వ్యక్తులు నివాసాల్లో చొరబడి సోదాలు నిర్వహించారు. ఈ దృశ్యాలు సీసీ ఫుటేజీల్లో రికార్డు అయ్యాయి. వాకింగ్ వెళ్లే వారు చూసి గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని సమాచారం ఇవ్వడంతో అప్పటికే దొంగల ముఠా పారిపోయింది. పోలీసులు, సీసీ కెమరాల ఫుటేజీ, వేలు ముద్రలను సేకరించారు.అంతరాష్ట్ర దొంగల ముఠాగా భావిస్తున్నారు. లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి : ఎస్పీ

దొంగల ముఠా సంచారంపై పోలీస్ నిఘా పటిష్టం చేయాలని ఎస్పీ అపూర్వరావు అధికారులను ఆదేశించారు. దొంగతనాలు, దోపిడీలు జరగకుండా నిఘా వ్యవస్థతో పాటు పెట్రోలింగ్ చేయాలని యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దొంగల ముఠా కదలికలపై ఫోన్ లొకేషన్, సీసీ కెమరాల ఆధారంగా ఎటు వైపు వెళ్లారు? ఏ ప్రాంతానికి చెందిన వారో గుర్తించాలన్నారు. రైల్వేస్టేషన్, జాతీయ, రాష్ట్ర రహదారులు ఉన్న పోలీస్ అధికారులు మరింత నిఘా పెంచాలని సూచించినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

హాలియా : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. హాలియా, చిట్యాల మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుపాషిపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కె ఉస్మాన్(23) రోజువారి కూలీ పని నిమిత్తం ఉదయం 5.30 గంటల సమయంలో తన ఇంటి నుంచి బైక్‌పై నల్లగొండకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో పులిమామిడి నుంచి ఇసుకను తరలిస్తూ కుమ్మరికుంట (కేకే కాలువ) వైపు అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్ మారేపల్లి గ్రామ శివారులోని ఉస్మాన్ ప్రయాణించే బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఎస్‌కె ఉస్మాన్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఎస్‌కె ఇమాంబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ..

చిట్యాల: చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన ఎదుళ్ల శేఖర్‌రెడ్డి(55) గ్రామ శివారులోని గాంధీ గుడి వద్ద గల వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు శేఖర్‌రెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా కారు నడుపుతున్న వ్యక్తి సైతం గాయపడ్డాడు. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, రక్షాబంధనం, రుత్విగ్వరనం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్ఛరణాలతో వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాబాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- నల్లబెల్లం, పటిక, సారా పట్టివేత
- ఐదుగురు సారా విక్రేతల అరెస్ట్



పట్టబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: నియోజకవర్గంలో దాడులు నిర్వహించి నల్లబెల్లం, పటిక, సారా, వాహనాన్ని పట్టుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గరిడేపల్లి, పాలకవీడు మండలాల్లో మంగళ, బుధ వారాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ చేసిన 630 కేజీల నల్లబెల్లం, 20 కేజీల పటిక, 35 లీటర్ల సారా, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతునున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు సతీష్ కుమార్‌రెడ్డి, వెంకన్న, సిబ్బంది నాగరాజు, రవి, నాగయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions received on behalf of my client M/s The Metal Powder Company Limited, Maravankulam, Thirumangalam - 625 706 Madurai District, Tamilnadu represented by its Chief Executive Officer, A.Kasirajan, I hereby issue this notice to the entire Public :

My client Company is intending to purchase the below mentioned schedule property and is willing to obtain a Sale Agreement from the land owners Mr. Amaravadi Sampath Kumar, Ms. AmaravadiKatyayini, Mr. Amaravadi Sudhakar, Mr.Amaravadi Chandramouleshwara Prasad, Mr.Amaravadi Sathyasai residing at 18-196/6, Teachers Colony, Huzurnagar, Suryapet District, Telangana 508204 and Mr. Amaravadi Gopala Krishna Murthy residing at 1-9-485/8/1, Lalitha Nagar, Adikmet, Musheerabad, New Nallakunta, Hyderabad-500044.

The Owners state that their rights are free from all encumbrances, charges, claims, etc. of whatsoever nature and have a clear, absolute and marketable title and interest on the 'Schedule Property'. This public notice is issued for verification of the title of the 'Owners' in respect to the 'Schedule Property'.

All or any persons including any banks, financial institutions or any other party or person, having any valid and legal claim, right, title, demand or interest by virtue of any sale, gift, lease, tenancy, license, exchange, partition, mortgage, charge, lien, inheritance, succession, trust, maintenance, possession, easement, agreement, lis-pendence, stay order, attachment, decree, specific performance or otherwise or any other right of whatsoever nature are required/ called upon to convey their objection/s in writing and should be reached within 5 days from issuance of this notice to the below mentioned address along with all supporting documents relating to such claim, failing which it shall be deemed that there is /are no claim/s and such claim/s if any, shall be considered to be waived and abandoned in respect of the 'Schedule Property'.

Sl.No.	Name of the owner	Sy. No. 488 and Sub division	Extent Acre.Gts
1	Amaravadi Sampath Kumar	Sy. No.488/7/9	7.25
2	Amaravadi Katyayini	Sy. No.488/7/11	2.25
3	Amaravadi Sudhakar	Sy. No.488/7/8, 488/25	14.25
4	Amaravadi Chandramouleshwara Prasad	Sy. No.488/7/6	7.25
5	Amaravadi Gopala Krishna Murthy	Sy. No.488/7/3	7.25
6	Amaravadi Sathyasai	Sy. No.488/7/5	7.25
		Total	47.30

'SCHEDULE PROPERTY'

An extent of Ac. 47.30 Guntas in Sy. No. 488 and its sub division was made as mentioned above and situated with in Vellatoor Grampanchayat Limits, Vellatoor Village, Chinthalapalem Mandal, Chinthalapalem Sub District, in the revenue District of Suryapet and being bounded by:

East : Land of others & 12 ft road
South : Land of other owners
West : Land of Anjani Cements & road
North : Land of Main Road & Govt. land (Forest Land)

Station: Jaggayyapet,
Date: 13/04/2023

AKULA SWATHI KUMAR, B.Com., LL.B.,
Advocate- Notary, Cheruvu Bazar,
Jaggayyapet-521 175, N.T.R.District,
Andhra Pradesh. Cell No.09848440134

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెన్‌పహాడ్ : రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సుందరి కిరణ్‌కుమార్, ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్యలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అనాజిపురం, సింగారెడ్డిపాలెం, దూపహాడ్, భక్తాళాపురం గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. పంటలకు మద్దతు ధర కల్పించి రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చడానికే కొనుగోళు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేషగిరిరావు, మండల వ్యవసాయ అధికారి కృష్ణసందీప్, ఏపీఎం అజయ్ నాయక్, ఆర్ఐ స్వప్న, సర్పంచ్‌లు చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, షరీఫుద్దిన్, భిక్షం, ఎంపీటీసీ గద్దల నాగరాజు, ఏఈఓలు సంధ్య, గోపి, వెలుగు సీసీలు ఐత రాజు చెన్నయ్య, సైదులు, సంఘ బంధం సభ్యురాళ్లు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయడం లేదని..

- సహకార సంఘానికి తాళం వేసిన రైతులు



సహకార సంఘ కార్యాలయ గేటుకు రైతులు వేసిన తాళం

నడిగూడెం : మండల పరిధిలోని తెల్లబెల్లి సహకార సంఘంలో అర్హులకు రుణాలు మంజూరు చేయడం లేదని బుధవారం అదే గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆ సహకార సంఘం కార్యాలయానికి తాళం వేశారు. అనంతరం డీసీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంబంధిత చైర్మన్, సీఈఓ దీర్ఘకాలీక రుణాలైన డైరీ రుణాలు మంజూరు చేయడంలేదని, 23 మందిలో 20 మందికి రుణాలు మంజూరు చేసి, మిగతా ముగ్గురికి మొండిచేయి చూపారని తెలిపారు. లంచం ఇస్తేనే రుణాలు మంజూరు చేస్తామంటున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. తమకు తక్షణమే రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితులు బడేటి లింగమ్మ, వీరబోయిన నాగమణి, బుర్రా సతీష్ ప్రభుత్వాన్ని కోరారు.

డబుల్ ధమాకా



అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామానికి చెందిన మార్తె సైదులు, నాగమ్మ దంపతులు సాకుతున్న ఆవు బుధవారం ఒకే ఈతలో రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. రెండు మగ దూడలు ఒకే రూపంతో ఉన్నాయి. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతాయని పశువైద్యులు, గోపాల మిత్ర తెలిపారు.
–అడ్డగూడూరు

నిప్పు అంటుకుని మొక్కలు దగ్ధం

మద్దిరాల : నిప్పు అంటుకుని మొక్కలు దగ్ధమయ్యాయయి. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న జమాయిల్ మొక్కలకు అంటుకుని వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో పలు మొక్కలు దగ్ధమైనట్లు తెలిపారు.

పబ్లిక్ నోటీస్

నా క్లయింటున్నా తమిళనాడు రాష్ట్రం, మధురై జిల్లా, మరవంకులం, తిరుమంగళం పట్టణం–625 706 పరిధిలో గల ది మెటల్ పౌడర్ కంపెనీ లిమిటెడ్ తరపున చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.కాశిరాజన్ గారి నుండి సంజాయిషీని పొంది ఇందుమూలముగా యావత్తు ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా :-

తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్ టౌన్, పిన్‌కోడ్-508 204 టీచర్స్ కాలనీ, డోర్ నెం.18-196/6 నివాసస్తులు 1.అమరవాది సంపత్ కుమార్, 2.అమరవాది కాత్యాయని, 3.అమరవాది సుధాకర్, 4.అమరవాది చంద్రమౌళీశ్వర ప్రసాద్, 5.అమరవాది సత్యసాయి మరియు తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ జిల్లా, న్యూ నల్లకుంట, ముషీరాబాద్, అడిక్‌మెట్, లలితా నగర్, డోర్ నెం.1-9-485/8/1 నివాసస్థుదు అమరవాది గోపాలకృష్ణమూర్తి అను వారలు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థికి యజమానులు అయి ఉన్నారు. అట్టి ఆస్థిని మా కంపెనీ తరపున కొనుగోలు చేసి అగ్రిమెంట్ వ్రాయించుకొనుటకు ఒప్పుదల అయి ఉన్నది.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థికి పైన తెలిపిన అమరవాది సంపత్ కుమార్ వగైరాలు యజమానులు అయి ఉండి సర్వ సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. అట్టి ఆస్థి పై వారికి మాత్రమే సర్వ హక్కులు కలవు. అని మరియు సదరు ఆస్థిపై ఎట్టి అన్యాక్రాంతములు గాని, చార్జీలు కాని, క్లైయిమ్స్ వగైరాలు ఏమీ లేవని మరియు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థికి సంబంధించి వారి యొక్క యాజమాన్యం తనిఖీ చేసుకునే నిమిత్తం యావత్తు ప్రజానీకానికి ఈ పబ్లిక్ నోటీసును ఇవ్వటమైనది.

యావత్తు ప్రజానీకం కాని, లేక మరి యే ఇతర వ్యక్తి గాని, బ్యాంకులు గాని, ఆర్థిక సంస్థలు కాని లేక ఇతర పార్టీలు కాని లేక వ్యక్తులు గాని ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిపై చట్టపరమైన హక్కులు గాని, యాజమాన్యం గాని, డిమాండ్లు గాని లేక ఏ విధమైన ఇంట్రస్టులు అనగా విక్రయం, దాఖలు, లీజులు, అద్దె ఖరారు నామాలు, లైసెన్సు, మార్పిడి, పారీఖత్తు, తనఖాలు, చార్జి, వారసత్వ రిత్యా, ట్రస్టు, మెయింటెనెన్స్, స్వాధీనం, ఈజ్‌మెంట్ మరియు ఎగ్రిమెంట్లు, దావా తగాదాలు, స్టే ఆర్డర్, జప్తులు, డిక్రీలు, విక్రయ యగ్రిమెంట్లు లేదా ఎటువంటి అభ్యర్థనలు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిపై ఉన్న ఎడల లిఖిత పూర్వకముగా ఈ క్రింద తెలియజేసిన అడ్రస్సుకు ఈ నోటీసు తేదీ నుండి 5 రోజులలో చేరులాగున అన్ని విధములైన సంబందిత మరియు మద్దతు (లింకు డాక్యుమెంట్లు) దస్తావేజులు పంపగలరు. పైన తెలిపిన సమయములోపల ఎటువంటి అభ్యంతరములు రాని ఎడల ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి సక్రమమైన ఆస్థి అని దరిమిలా ఏమైనా అభ్యంతరములు వచ్చిన ఎడల వాటిని పరిగణలోనికి తీసుకొనుట జరుగదు అని ఇందుమూలముగా యావత్తు ప్రజానీకానికి తెలియజేయడమైనది.

షెడ్యూలు :- తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, కోదాడ సబ్ రిజిస్ట్రీ, కోదాడ సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా చింతలపాలెం మండలం, వెల్లటూరు గ్రామ పంచాయతీ లిమిట్స్‌లో ఉండబడిన వెల్లటూరు గ్రామ ఆర్.ఎస్.నెం.488గా గల ఆస్థి దరిమిలా సబ్ డివిజన్ కాబడి ప్రస్తుతము ఆస్థి యజమానుల స్వాధీనంలో అనగా అమరవాది సంపత్ కుమార్ గారి ఆస్థి అయిన ఆర్.ఎస్.నెం.488/79రు దాఖలా య.7.25 కుంటలు, అమరవాది కాత్యాయని గారి ఆస్థి అయిన ఆర్.ఎస్.నెం.488/7/11 రు దాఖలా య.2.25 కుంటలు, అమరవాది సుదాకర్ గారి ఆస్తి అయిన ఆర్.ఎస్.నెం.488/7/8, ఆర్.ఎస్.నెం.488/25 రు దాఖలా య.14.25 కుంటలు, అమరవాది చంద్రమౌళీశ్వర ప్రసాద్ గారి ఆస్థి అయిన ఆర్.ఎస్.నెం.488/7/6 దాఖలా య.7.25 కుంటలు, అమరవాది గోపాలకృష్ణమూర్తి గారి ఆస్థి అయిన ఆర్.ఎస్‌నెం.488/7/3 దాఖలా య.7.25 కుంటలు, అమరవాది సత్యసాయి గారి ఆస్థి అయిన ఆర్.ఎస్.నెం.488/7/5 దాఖలా య.7.25 కుంటలు, వెరశి మొత్తం య.47.30 కుంటలు ఏకప్లాటు గా గల భూమికి.

హద్దులు : తూర్పు: ఇతరుల ఆస్థి మరియు అ.12లు వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** ఇతరుల భూమి అనగా ఆస్థి యజమానుల సోదర సోదరీ వగైరాల భూమి, **పడమర:** అంజనీ సిమెంట్స్ వారి భూమి మరియు రోడ్డు, **ఉత్తరం:** మెయిన్ రోడ్డు మరియు గవర్నమెంటు వారి భూమి (అడవి భూమి)

సం/- **ఆకుల స్వాతి కుమార్** B.Com., LLB.
అడ్వకేట్ – నోటరీ
చెరువు బజార్, జగ్గయ్యపేట – 521175, **NTR** జిల్లా,
ఆంధ్రప్రదేశ్ – 521175, సెల్ : 9848440134

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తప్పనిసరి

- లేకుంటే పండించిన పంటలో 10నుంచి 20శాతం నష్టపోయే ప్రమాదం
- పెద్దవూర ఏఓ సందీప్



సందీప్, ఏఓ పెద్దవూర



ఆరబోసిన వడ్లు

పాడి పంట

పెద్దవూర : యాసంగి వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంటికి వచ్చిన ధాన్యాన్ని ఎలా భద్రపర్చుకోవాలో తెలియక రైతులు తికమక పడుతుంటారు. ఆరుగాలం శ్రమించి అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం రైతులకు సవాలుగా మారింది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం లేకపోలేదని అంటున్నారు.. మండల వ్యవసాయ అధికారి సందీప్. ధాన్యం నిల్వ చేసుకోవడంలో తీసుకో వాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరిస్తున్నారు. ధాన్యం నూర్చిన తర్వాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరికోతల సమయంలో ధాన్యంలో 20శాతం తేమ ఉంటుంది. గతంలో కూలీలచే వరి కోతలు కోపించేవారు. ప్రస్తుతం రైతులు కూలీలపై ఆధార పడకుండా యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. పంట పచ్చగా ఉన్నప్పుడే వరికోతలు కోస్తున్నారు. దీంతో ధాన్యంలో మరింత తేమ ఉంటే అవకాశాలు మెండుగా ఉంటాయి. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ శాతం 14లోపు వచ్చేదాక చూసుకోవాల్సి ఉంటుంది. ధాన్యాన్ని నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగచేస్తాయి. అంతే కాక ఎలుకలు ధాన్యాన్ని తినడమేకాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాలు

ముక్క పురుగు : పంట కోయడానికి ముందు నుంచి ముక్క పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. లార్వా ప్రౌడ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్ల చిలుక : ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడువాసన వస్తుంది. తల్లి కీటకం వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పైపొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌడ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటకు వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులపై కనిపిస్తుంది.

నుసి పురుగు

దీనినే పచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మి.మీ పొడవు ఉంటుంది. ప్రౌడ కీటకం ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తరువాత గింజ పైపొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతులు తక్కువ ధాన్యాన్ని వెదురు గాదెలు, సిమెంటు గాదెలు, లోహపు గాదెల ద్వార నిల్వ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు లేదా గిడ్డంగులను సిమెంటు కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షం నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలో కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచుల పైన, లోపల మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. మరునాడు సంచులను ఎండలో ఆరబెట్టాలి.

ఎలుకల నివారణకు చర్యలు

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెస్ మూతలు అమర్చాలి. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ రోజులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చు.